సాక్షి జగిత్యాల

గురువారం । 23 । నవంబర్ । 2023

9



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.



ఘనంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి నృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోదావరికి గంగాహారతి నిర్వహించారు. మహిళలు గోదావరిలో దీపాలు వదిలారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/19.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఓటింగ్ శాతం పెంచాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

ఇబ్రహీంపట్నం: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం, వర్షకొండలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా చూడాలని, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలోని 165 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరిస్తామని తెలిపారు. ఎక్కడైనా గొడవలు జరిగితే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు ఉమాసాగర్, చిరంజీవి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు షీటీం కృషి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

జగిత్యాలక్రైం: మహిళల రక్షణకు షీటీం నిరంతరం కృషి చేస్తోందని షీటీం సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని ఓ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలపై నేరాలు జరిగినప్పుడు పోలీసులను సంప్రదించాలని సూచించారు. అన్యాయానికి గురైతే భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆకతాయిల వేధింపుల నుంచి మహిళల రక్షణకు షీటీం నంబర్ 87126 70783లో సంప్రదించాలని అన్నారు. సోషల్ మీడియా వినియోగంలో.. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

రాయికల్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు



రాయికల్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు

రాయికల్: రాయికల్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పట్టణంలోని శివాజీ విగ్రహం, గాంధీచౌక్, పాతబస్టాండ్‌లో బీఎస్‌ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. స్థానికులు వారికి ఘనస్వాగతం పలికారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేశ్‌కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావ్, ఆర్ఐ వేణు, సీఐ ఆరీఫ్ అలీ, రాయికల్ ఎస్సై అజయ్, సారంగాపూర్ ఎస్సై తిరుపతి, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న బసవ రాజేంద్ర

జగిత్యాల/ధర్మపురి: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు పరిశీలకులు బసవ రాజేంద్ర అన్నారు. బుధవారం ధర్మపురి, జగిత్యాల నియోజకవర్గాల్లో పోలింగ్ సిబ్బంది శిక్షణ తరగతులను, ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దివాకర, రిటర్నింగ్ అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ అశోక్ పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలోనే అభ్యర్థులు



- హోరెత్తిన ఇంటింటి ప్రచారం
- సమీపిస్తున్న పోలింగ్ గడువు
- నిత్యం సమావేశాలతో బిజీబిజీ

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నిలకు పోలింగ్ సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. పూర్తిగా నియోజకవర్గాలకే పరిమితం అవుతూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ఓటర్లను కలుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. గడపగడపకూ తిరుగుతూ ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు వారు చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తుండగా.. కాంగ్రెస్ అభ్యర్థులు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులు ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలతో ముందుకెళ్తున్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు ఒక్కో టీంలుగా వెళ్తూ ప్రతి షాపులు, ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేయడంతోపాటు, తమకే ఓటు వేయాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఒకరిని మించి ఒకరు ప్రచారం చేపడుతున్నారు. ప్రతి నిమిషం ప్రజల్లోనే గడుపుతున్నారు. ఉదయం బయటకు వెళ్లిన అభ్యర్థులు భోజనం, టిఫిన్స్ సైతం కార్యకర్తలు, నాయకుల ఇంటి వద్దనే చేస్తున్నారు.

కుటుంబం మొత్తం..

ఈసారి ప్రధాన పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు మొత్తం ప్రచారంలోనే పాల్గొంటున్నారు. ఒక్కో గ్రామాన్ని.. ఒక్కో వార్డును ఎన్నుకుని తమదైన రీతిలో కుటుంబసభ్యులు ప్రచారం చేపడుతున్నారు. ముఖ్యంగా సతీమణులు, కూతుళ్లు, అల్లుళ్లు అందరూ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈసారి ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను కోరుతున్నారు.

హోరెత్తుతున్న మైకులు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మైకులతో హోరెత్తుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ వాహనాలను ఏర్పాటు చేసుకుని డీజే మోతలతో ప్రచారం చేస్తున్నారు. దీంతో ప్రజలకు కొంత ఇబ్బందికరంగా మారింది. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో తిరుగుతూ ప్రజలకు పాటల ద్వారా వివరిస్తున్నారు. అలాగే ఇంటింటికీ వారు ముద్రించిన కరపత్రాలను అంటిస్తున్నారు.

మిగిలింది ఐదు రోజులే..

పోలింగ్‌కు ఐదు రోజుల సమయమే ఉండడంతో ప్రచారాన్ని విస్తృతం చేశారు. అభ్యర్థులు తిరగడమే కాకుండా వాహనాల ద్వారా ప్రతి గల్లీకి తిప్పుతూ ప్రచారం చేయడంతోపాటు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఐదురోజులే ఉండడంతో ప్రధాన అభ్యర్థుల్లో ఆందోళన సైతం మొదలైంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. బరిలో జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ముఖ్యంగా ప్రతి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రచారం ఎక్కువగా ఉండగా.. స్వతంత్రులు, రిజిస్టర్ పార్టీల వారు ఏదో నామమాత్రంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి నిమిషం విలువైంది కావడంతో నేతలు ఓట్లు ఎలా రాబట్టుకోవాలన్నది ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు గ్రామాల్లోనే తిరుగుతూ.. రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు మున్సిపాలిటీల్లో ప్రచారం చేపడుతున్నారు. పక్కా వ్యూహ రచన చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'బీఆర్‌ఎస్ హయాంలో కోరుట్ల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది. మా తండ్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కృషితో రెండు మున్సిపాలిటీలు.. ప్రతి గ్రామంలో వసతులు సమకూర్చాం. వైద్యవృత్తిలో కొనసాగుతూనే పదిహేనేళ్లుగా నాన్నతో కలిసి ప్రజాసేవలో ఉంటున్న. వైద్యపరంగా ప్రజలకు సేవలందిస్తున్నాను. తండ్రి స్ఫూర్తితో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. ప్రజలు ఆశీర్వదిస్తారని విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఈ ప్రాంత యువత ఉపాధి కోసం స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది..' అని అన్నారు కోరుట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేస్తున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది..?

సంజయ్: బీఆర్‌ఎస్ పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రతిఇంటికీ లబ్ధి చేకూరింది. కేసీఆర్ పాలనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలు భావిస్తున్నారు. ప్రచారానికి మంచి స్పందన లభిస్తోంది. భారీ మెజార్టీ ఇస్తారని ఆశిస్తున్నాను.

సాక్షి: నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా మీ తండ్రి విద్యాసాగర్‌రావు ఎలాంటి అభివృద్ధి చేశారు..?

సంజయ్: జిల్లాలో రెండు మున్సిపాలిటీలు ఉన్న నియోజకవర్గం కోరుట్ల. ఈ రెండు పట్టణాలకు రూ.50కోట్ల చొప్పున ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో వాటి రూపురేఖలు మారాయి. అలాగే ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి సమస్య పరిష్కరించారు. వైద్యపరంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వసతులు కల్పించి మెరుగైన చికిత్స అందేలా చేశారు.

సాక్షి: నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు ఎలా ఉంది..?

సంజయ్: రాష్ట్రంలోనే కోరుట్ల నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందేలా చొరవ తీసుకున్న ఘనత విద్యాసాగర్‌రావుది. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూడా వేలాది మందికి లబ్ధి కలిగించారు. దాదాపుగా ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి కలిగింది.

సాక్షి: వైద్యుడిగా ప్రజలకు ఎలాంటి సేవలందించారు..?

సంజయ్: హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యునిగా పనిచేస్తున్నాను. మెరుగైన చికిత్స కోసం అక్కడకు వచ్చే వారికి అన్నివిధాలుగా ఆదుకుంటున్నాను. ప్రతి ఒక్కరికీ బిల్లుల్లో డిస్కౌంట్ ఇప్పిస్తూ తక్కువకే వైద్యసేవలు అందేలా చూస్తున్నాను. అలాగే నియోజకవర్గంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వందలాది మందికి ఖరీదైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేయించాను. కరోనా సమయంలో ఆక్సిజన్, వ్యాక్సిన్, ఇంజక్షన్లు, ఇతర మందులు కొరత రాకుండా చూశాను. బాధితుల ఇళ్ల వద్దకు నేరుగా వెళ్లి ధైర్యం చెప్పడమే కాకుండా నిత్యావసర సరుకులు కూడా అందించాం.

సాక్షి: నిరుద్యోగులకు ఉచిత కోచింగ్‌పై..?

సంజయ్: ప్రభుత్వం కొన్ని నెలల క్రితం పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసింది. పేద కుటుంబాల యువతకు స్థానికంగా శిక్షణ ఇప్పించేందుకు ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయించాం. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వడంతోపాటు అక్కడే భోజన వసతి ఏర్పాటు చేసి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాను. దీనిని సద్వినియోగం చేసుకొని ఎంతో మంది ఉద్యోగాలు సాధించడం సంతోషాన్ని కలిగించింది.

సాక్షి: ఎమ్మెల్యేగా ఎన్నికైతే ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్తారు..?

సంజయ్: ప్రధానంగా ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వేలాది మంది వలస వెళ్తున్నారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ ఉంది. ఇక్కడ ఎన్నో ఉపాధి అవకాశాలున్నాయి. వారు తిరిగి ఇక్కడకు రావడానికి స్థానికంగా పరిశ్రమలను నెలకొల్పేలా చొరవ తీసుకుంటా. ఇప్పటికే ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి అందులో స్థానికులకే అవకాశం కల్పించాం. అలాగే ఉన్నత విద్య కోసం పీజీ కళాశాలలను ఏర్పాటు చేయిస్తా. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి సభలో ఉద్యానవన కళాశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. గెలిచిన తర్వాత దానిని మంజూరు చేయిస్తాను. వీటితో పాటు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ నాన్‌లోకల్. నేను స్థానికుడిని. నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉంది. అందుబాటులో ఉండి సేవలందిస్తాను. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

మెడికల్ హబ్‌గా జగిత్యాల

- రహదారులను అభివృద్ధి చేశాం
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల పట్టణాన్ని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్ అన్నారు. రహదారులతోపాటు పేదలకు వైద్యం అందించేందుకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మెడికల్, నర్సింగ్ కళాశాలలు ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని 21, 5, 37 వార్డుల్లో బుధవారం కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఓట్ల రాజకీయాలకే పరిమితయ్యారని, వారు చేసిందేమీ లేదన్నారు. గతంలో ఎన్నోమార్లు ఇక్కడ పాలించిన వారు కనీసం ఒకరోడ్డు కూడా బాగు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక జగిత్యాల రూపురేఖలు మారిపోయాయని, ఉద్యానవనాలు, సమీకృత మార్కెట్లు అభివృద్ధి చేశామన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

పార్టీ పథకాలకు ఆకర్షితులవుతున్న యువత బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని సంజయ్‌కుమార్ అన్నారు. 24వ వార్డుకు చెందిన యువకులు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు.

దేశానికి అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ

జగిత్యాలరూరల్: సాగునీటికి పన్ను వసూలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి, మోరపల్లి, చల్‌గల్, చెర్లపల్లె, అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామాల్లో కార్నర్ సమావేశాలు నిర్వహించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా ధాన్యంరాశులే కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి కరెంట్ ఎలా వచ్చిందో ప్రజలు గుర్తు తెచ్చుకోవాలన్నారు.

హ్యాట్రిక్ ఖాయం: జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత

సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం గుత్రాజీపల్లి, అనంతారం, హబ్సీపూర్, సంగెంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే సతీమణి రాధికతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బాల ముకుందం, మహేశ్, ఎల్లారెడ్డి, నారాయణ రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అందుబాటులో ఉంటా

రాయికల్: ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని అయోధ్య, ఆలూరుకు చెందిన ముదిరాజ్, యాదవ, శాలివాహన కుల సంఘాల సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మరోసారి తనకు అవకాశం ఇస్తే నిరుపేదలకు సేవ చేస్తానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేశ్‌యాదవ్, రైతుబంధు సమితి కన్వీనర్ మల్లారెడ్డి పాల్గొన్నారు. సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని ఒడ్డెలింగాపూర్, చెర్లకొండాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి పాల్గొన్నారు.



తాటిపల్లిలో ఎమ్మెల్యేకు బొట్టు పెడుతున్న మహిళలు

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలకు ఊపు

సారంగాపూర్: బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలకు మరింత ఊపు వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని రంగపేటకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చింది బీఆర్‌ఎస్ అని స్పష్టం చేశారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలోని సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి సీనియర్ డెప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ వ్యాస్ కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటర్ సమాచార స్లిప్‌ల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, రిసెప్షనిస్ట్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు పకడ్బందీగా ఉండాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఓటరు గుర్తింపు కార్డు ముద్రణకు 95,973 ఆర్డర్ పెట్టగా ఇప్పటివరకు 66,735 కార్డులు పంపిణీ చేశామని, మిగతావి త్వరలోనే అందిస్తామన్నారు. సీ విజిల్ కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని, ఇంటినుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు జిల్లాలో 1,141 ఉన్నాయని, మొత్తం 72 టీంలను ఏర్పాటు చేశామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ సైతం పూర్తయిందన్నారు. అలాగే జిల్లాలో కౌంటింగ్ నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఈటల వర్గం..ఆగమాగం!

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వర్గాన్ని ఓ ఆందోళన వెంటాడుతోంది. ఇటు హుజూరాబాద్, అటు గజ్వేల్‌లో పోటీ చేస్తున్న ఆయన రెండుచోట్లా గెలిస్తే.. హుజూరాబాద్‌కు రాజీనామా తప్పదన్న ప్రచారమే ఇందుకు కారణం. వాస్తవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగిన బీసీ నాయకుడు ఈటల రాజేందర్. తన అనుచరుల్లో ఈ రకపు ఆందోళనలు పెరిగేందుకు ఆయన వ్యవహారశైలి, రాజకీయ ఒడిదుడుకులే కారణమవుతున్నాయి.

- రెండుచోట్లా గెలిస్తే హుజూరాబాద్‌కు రాజేందర్ రాజీనామా?
- ఆ తర్వాత తమ భవితవ్యమేంటని లీడర్ల ఆందోళన
- తుల ఉమ తరహాలో పట్టించుకోరేమోనని సందేహం
- ఇప్పటికే ఎంపీ సంజయ్, గంగాడి వర్గాలతో పెరిగిన దూరం



ఈటల రాజేందర్ మనుషులను వాడుకొని వదిలేస్తారన్న ప్రచారాన్ని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ముమ్మరం చేశాయి. గతంలో సీఎం కేసీఆర్ సాయంతో తిరుగులేని నేతగా ఎదిగిన ఆయన, ఆ తర్వాత బీజేపీలో ఎంపీ బండి సంజయ్ సాయంతో గెలిచాడంటున్నాయి. గతంలో బీఆర్‌ఎస్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలతో కేసీఆర్‌కు, హుజూరాబాద్ ఉప ఎన్నిక తర్వాత బండి సంజయ్‌కు వెన్నుపోటు పొడిచారని చెబుతున్నాయి. తన విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంపీ సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడానికి ఈటల రాజేందరే కారణమని పేర్కొంటున్నాయి. ఆయనను నమ్ముకొని, బీజేపీలోకి వచ్చిన తుల ఉమకు పార్టీ టికెట్ ఇప్పించడంలోనూ విఫలమయ్యారని ఆమె అనుచరులు అంటున్నారు. ఆయన కేసీఆర్, సంజయ్‌ని వాడుకున్నట్లే.. తమనూ వాడుకొని, వదిలేశారని మండిపడుతున్నారు.



కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌తో గట్టి పోటీ..

గతంలో ఈటల రాజేందర్ హుజూరాబాద్‌లో ఏ ఒక్కరినీ బీఆర్‌ఎస్ నుంచి ఎదగనీయలేదని, అందుకే ఇంత కాలం గెలుస్తూ వచ్చాడని పలువురు అంటున్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారింది. ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి 2018లో ఆయనకు చెమటలు పట్టించారు. ప్రస్తుతం పాడితోపాటు కెప్టెన్ లక్ష్మీకాంతరావు అన్న మనవడు వొడితెల ప్రణవ్(కాంగ్రెస్) కూడా బరిలో ఉన్నారు. ఈ ఇద్దరూ అంగబలం, అర్థబలం దండిగా ఉన్న నేతలు. వీరిని ఢీకొట్టాలంటే వాస్తవానికి ఎంపీ బండి సంజయ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిల సాయం తప్పనిసరి. కానీ, వీరిద్దరితో ఈటలకు పొసగడం లేదన్న ఆరోపణలున్నాయి. వారు ఎక్కడా ఆయన ప్రచారంలో కనిపించకపోవడం గమనార్హం.

గెలిస్తే 6 నెలల్లో రాజీనామా..

ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నేత. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021 మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక నాయకుడు కావడం విశేషం. శాసనసభాపక్ష నేతగా, మంత్రిగా తన నియోజకవర్గాన్ని బాగానే అభివృద్ధి చేసుకున్నారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల ఏర్పాటు, హుజూరాబాద్‌లో ప్రభుత్వ ఆస్పత్రి తదితరాలతో ఆయన స్థానికుల మనసు గెలుచుకున్నారు. 2021లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ను వీడి, బీజేపీ నుంచి ఉపఎన్నికలో విజయం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఆయన తన స్థానంతోపాటు సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనూ పోటీ చేస్తున్నారు. రెండుచోట్లా గెలిస్తే 6 నెలల్లో ఏదో ఒక స్థానానికి ఉపఎన్నిక అనివార్యం. సీఎంపై గెలిచాక ఆ రికార్డును కాపాడుకునేందుకు అక్కడే ఉంటారు కానీ.. అక్కడ రాజీనామా చేసి, హుజూరాబాద్‌కు ఎందుకు వస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది. అలాంటప్పుడు రాజేందర్‌ను గెలిపిస్తే.. తమ భవితవ్యం ఏంటన్న ఆలోచన ఆయన కేడర్‌లో నిరుత్సాహం నింపుతోంది.



రాజ్‌నాథ్ ఎదుట కాంగ్రెస్‌పై ప్రశంసలా?

ఇటీవల జమ్మికుంటలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో నిర్వహించిన సభలోనూ ఎంపీ సంజయ్ పాల్గొనలేదు. ఎక్కడా ఆయన ప్రస్తావన లేకపోయేసరికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అదే వేదికపై ఈటల రాజేందర్ కాంగ్రెస్ నేతలపై ప్రశంసల వర్షం కురిపించారు. మాజీ మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ జెడ్పీటీసీ సభ్యుడు గంట రాములు యాదవ్, ఆయన సోదరులు తన గెలుపు కోసం పని చేశారని కీర్తించారు. ఈ మాటలకు వేదిక కింద ఉన్న బీజేపీ నాయకులు అవాక్కయ్యారు. తన కోసం ప్రచారం చేసిన ఎంపీ సంజయ్ పేరు ఎందుకు ఉచ్ఛరించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తన గెలుపు కోసం పని చేసిందని చెప్పి, బీజేపీ విజయాన్ని పలుచన చేశారని మండిపడుతున్నారు. ఏ వేదిక ఎక్కినా.. వ్యక్తిగత విషయాలు ప్రస్తావిస్తున్నారు తప్ప.. బీజేపీ సిద్ధాంతాలను, దేశభక్తి, ప్రధాని మోదీ, భారత్ మాతా, అద్వానీ, వాజ్‌పేయి అన్న పదాలు పలికేందుకు ఆయనకు మనసు రావడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలో తన కీలక అనుచరులుగా పేరొందిన వారంతా కాంగ్రెస్‌లో చేరడం చర్చకు దారితీసింది.

క్లుప్తంగా

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



సిబ్బందితో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్

జగిత్యాల/కోరుట్ల: ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కోరుట్ల నియోజకవర్గ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా అన్నారు. బుధవారం కోరుట్లలోని ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులూ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీరాంపూర్, ఒబులాపూర్ చెక్‌పోస్టులను పరిశీలించారు. పాఠశాలలో ఎలక్షన్ ఎలక్ట్రానిక్ మిషన్ల కమిషనింగ్, జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట కోరుట్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాజేశ్వర్, పోలీస్ పరిశీలకులు వివేకానంద సింగ్ ఉన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా శంకర్



శంకర్



హరికిరణ్

జగిత్యాల: ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మచ్చ శంకర్ నియమితులయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా మచ్చ శంకర్ ఎన్నిక కాగా.. ప్రధాన కార్యదర్శిగా బైరం హరికిరణ్, ఆర్థిక కార్యదర్శిగా బండి శ్రీనివాస్, భూమయ్య, శనిగారపు రవి, రవీందర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పర్వత్ రెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

హోంగార్డుకు ఆత్మీయ సన్మానం



దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: సుదీర్ఘకాలం పోలీస్‌శాఖలో పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు బి.వెంకటేశంకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన వెంకటేశం దంపతులను శాలువాతో సత్కరించి వెల్ఫేర్ ఫండ్ నుంచి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10 వేల చెక్కును అందించారు. 33 ఏళ్లపాటు పనిచేసిన తీరును మరువలేమని, కుటుంబ అవసరాలకు తమ సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆర్ఐలు రమేశ్, మధుకర్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం చేయిస్తున్న వ్యక్తిపై కేసు

వేములవాడ: ఇతర రాష్ట్రానికి చెందిన యువతితో వ్యభిచారం చేయిస్తున్న కంసాని శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడలోని మహాలక్ష్మి వీధిలో ఇతర రాష్ట్రానికి చెందిన యువతికి పని ఇస్తానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లి బంధించి వ్యభిచారం చేయించారని బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధాన్యం తూర్పారబట్టాల్సిందే..!

- నాణ్యత ప్రమాణాల నిబంధనలు గాలికి..
- ఖర్చు పెరుగుతుందంటున్న రైతులు



మిషన్ ద్వారా ధాన్యం తూర్పారపడుతున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలున్నా.. ఓవైపు రైస్ మిల్లర్లు, మరోవైపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తప్ప, తాలు లేకున్నా తూర్పార పట్టమని పట్టుబడుతున్నారు. దీంతో రైతులు చేసేదేం లేక తమ శ్రమతో పాటు అధిక ఖర్చు పెట్టి తూర్పార పట్టాల్సిన పరిస్థితి దాపురించింది.

నాణ్యత ప్రమాణాల నిబంధనలు

ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాల నిబంధనల ప్రకారం రైతులు తీసుకొచ్చే ధాన్యంలో క్వింటాల్‌కు మట్టి, పెళ్లలు, రాళ్లు 1 శాతం, చెత్త, తాలు 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారు కాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకముల మిశ్రమం 6 శాతం ఉన్నా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కాని కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తప్ప, తాలు ఉందని, ప్రతి కుప్పను తూర్పారపట్టమని నిర్వాహకులు చెబుతున్నారు. దీనికి సర్దిపై చేయాల్సిన అధికారులు సైతం వంత పాడుతున్నారు. ఒకవేళ నాణ్యత ప్రమాణాల ప్రకారం వ్యవసాయాధికారులు సర్టిఫైడ్ చేసిన తర్వాత కొనుగోలు నిర్వాహకులు తూకం వేసి బస్తాలను రైస్ మిల్లుకు పంపించినా.. తప్ప, తాలంటూ క్వింటాల్‌కు 1 నుంచి 2 కిలోల వరకు రైస్ మిల్లర్లు కట్ చేసే పరిస్థితి నెలకొంది. అయితే ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో రైస్ మిల్లర్ల కటింగ్ లేకున్నా.. రైతులకు ధాన్యం తూర్పార పట్టడం మాత్రం తప్పడం లేదు.

అప్పుడు ఇలా లేదు

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయి. ఆ సమయంలో రాని తప్ప, తాలు ఇప్పుడే ఎందుకు వస్తుందో అర్థం కాని ప్రశ్నగా మారింది. రెండేళ్ల క్రితం అంటే అగ్గి తెగులు వంటి రోగాలు వచ్చి కొంతమేర తప్ప వచ్చింది. అదే అదునుగా తీసుకుంటున్న రైస్ మిల్లర్లు అప్పటి నుంచి మొన్నటి యాసంగి వరకు జబర్దస్తీగా 40 కిలోల సంచికి కిలో నుంచి 2 కిలోలు కట్ చేశారు. తూకం వేసేటప్పుడు సంచికి బదులు సంచి వేయాల్సి ఉండగా, 700 గ్రాముల సంచికి కిలో కట్ చేస్తున్నారు. వరి కోసే హార్వెస్టర్లను ప్రతి సీజన్‌కు ఆధునికీకరించి తప్ప, తాలు రాకుండా చూస్తున్నా.. కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన తర్వాత తప్ప, తాలుందని పట్టమనడం కామన్‌గా మారిపోయింది.

మిషన్లు లేవు..

జిల్లాలో దాదాపు 398 కొనుగోలు కేంద్రాలుండగా.. అందులో చాలా కేంద్రాల్లో తూర్పార పట్టే మిషన్లు లేవు. మిషన్లున్నా పని చేసే పరిస్థితి లేదు. చాలా కొనుగోలు కేంద్రాల్లో విద్యుత్ సరఫరా లేదు. ఒకవేళ ఉన్నా విద్యుత్ స్తంభం ఎక్కడో ఉండటం, అక్కడి నుంచి సరిపడా విద్యుత్ తీగ లేక మిషన్ ధాన్యం కుప్పల వద్దకు తీసుకెళ్లే పరిస్థితి లేదు. దీంతో రైతులే ట్రాక్టర్‌కు ఫ్యాన్లు బిగించుకొని కూలీలతో చాటల ద్వారా ధాన్యం గాలికి ఎగబోయడం చేసి ధాన్యాన్ని తూర్పారపడుతుంటారు. కాని ట్రాక్టర్ ఫ్యాన్ల ద్వారా ఎగబోస్తే ఒప్పుకోమని, తూర్పార బట్టే మిషన్ ద్వారానే తూర్పారబట్టాలని ఇలా లేనిపోని కండీషన్లు రైతులకు శరాఘాతంగా మారాయి.

వైఎస్ హయాంలో కొనేవారు



ధాన్యం నిబంధనల ప్రకారమున్నా తూర్పార పట్టమంటున్నారు. వైఎస్ హయాంలో హార్వెస్టర్‌తో కోయించి కొనుగోలు కేంద్రంలో పోస్తే ధాన్యం కొనేవారు. ఇప్పుడు ప్రతి కుప్పను తూర్పార పట్టమనడంతో రైతులకు ఖర్చులు పెరుగుతున్నాయి.

– సత్యనారాయణరెడ్డి, సారంగాపూర్

తేమతో ఇబ్బంది



శీతాకాలంలో వరి ధాన్యంలో తేమ పోవాలంటేనే చాలా రోజులు పడుతుంది. దీనికితోడు ప్రతి కుప్పను తూర్పార పట్టమంటున్నారు. ఒక్క మిషన్ ఉంటే ఆ మిషన్ కోసం రాత్రింబవళ్లు తిరగాల్సి వస్తుంది. అధునాతన హార్వెస్టర్లతో కోయిస్తున్నందున తప్ప, తాలు వచ్చే పరిస్థితి లేదు.

– బందెల మల్లయ్య, చల్‌గల్, జగిత్యాల రూరల్(మం)

ప్రచారం అందరికి.. ఓటు నచ్చినోళ్లకు..



పెగడపల్లి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో గెలుపోటములపై అభ్యర్థులు, నాయకుల్లో గుబులు మొదలైంది. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా.. తమ భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆందోళన ఒక్కో అభ్యర్థిని పీడిస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లే తాత్కాలిక కార్యకర్తలకు మాత్రం ఎన్నికల పండుగ వచ్చింది. ఏ పార్టీ వారు ర్యాలీలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేసినా కూలి ఇచ్చి తీసుకెళ్తున్నారు. మహిళలకు ఒక్కొక్కరికి రూ.150 నుంచి 200 వరకు ముట్టచెబుతుండగా.. పురుషులకు అదనంగా మందు, విందు ఇస్తున్నారు. భుజంపై కండువా కప్పుకొని గంట నుంచి రెండు గంటల పాటు తిరిగితే కూలి డబ్బులు చేతికొస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన పార్టీలు నిర్వహించిన సమావేశానికి హాజరైన వారిలో వృద్ధులను పలకరిస్తే.. ఈ ఎన్నికల సీజన్లో ఇప్పటివరకు మూడుసార్లు సమావేశాలు, సభలకు వెళ్లినట్లు వివరించారు. ఇంతకి ఓటు ఎవరికని ప్రశ్నిస్తే మాత్రం.. ఇప్పుడే ఏమి చెప్పమని సెలవిస్తున్నారు. అంటే ప్రచారం అందరికి.. ఓటు మాత్రం నచ్చినోళ్లకన్న మాట.

నిందితుడికి ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: వ్యవసాయ విద్యుత్ మోటార్ వద్దకు విద్యుత్ తీగను నిర్లక్ష్యంగా తీసుకెళ్లి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమైన నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. పెగడపల్లి మండలం వెంగళాయిపేట గ్రామానికి చెందిన పిట్టల విద్యాధర్ చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మ్యాక వెంకయ్యపల్లి ఊర చెరువును లీజుకు తీసుకొని చేపలు పెంచుతున్నాడు. 2019 సెప్టెంబర్ 30న భారీ వర్షాలతో చెరువులోని చేపలు కిందికి కొట్టుకుపోతున్నాయనే సమాచారమందింది. విద్యాధర్‌తో పాటు అతని అన్న పిట్టల కరుణాకర్, అదే గ్రామానికి చెందిన కొలిపాక తిరుపతి, అంగలి సంతోష్, ఐతరవేని నర్సయ్య, ఆత్మకూరి అంజయ్య, ఆత్మకూరి హరీష్ చేపలు కొట్టుకుపోకుండా తమ మోటార్ సైకిళ్లపై చెరువు వద్దకు వెళ్లి వలలు వేశారు. తిరిగి సాయంత్రం 6.30 గంటల సమయంలో చెరువు కట్టపై నుంచి ఇంటికి వస్తున్నారు. మ్యాక వెంకయ్యపల్లి గ్రామానికి చెందిన మ్యాక బ్రహ్మానందరెడ్డి తన పొలానికి చెరువు నుంచి నీరందించేందుకు విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి విద్యుత్ తీగను చెరుకు కట్ట రోడ్డు మధ్యలో నుంచి తీసుకెళ్లాడు. ఈ తీగకు మోటార్ సైకిల్ తగిలి తీగ తెగింది. మోటార్ సైకిల్‌పై ఉన్న విద్యాధర్, తిరుపతి విద్యుత్ షాక్‌కు గురై చనిపోయారు. వెనక వచ్చిన వ్యక్తులు కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. బ్రహ్మానందరెడ్డిపై చర్య తీసుకోవాలని పెగడపల్లి పోలీసులకు విద్యాధర్ భార్య ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ బి.జీవన్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ కె.కిశోర్ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె.విద్యాసాగర్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో.. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం బ్రహ్మానందరెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ప్రేమజంట ఆత్మహత్య

- రాజన్నసిరిసిల్ల జిల్లాలో విషాదం



చెల్ల సంధ్య(ఫైల్)



సామల శ్రీధర్(ఫైల్)

కోనరావుపేట/తంగళ్లపల్లి: పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ప్రేమికులు క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలో విషాదం నింపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. జిల్లాలోని కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన సామల లక్ష్మీనారాయణ–ఇందిర దంపతులు కొన్నేళ్లుగా సిరిసిలలోని టెక్స్‌టైల్‌పార్క్‌లో నివసిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు శ్రీధర్(20) ఉన్నాడు. శ్రీధర్ ఐటీఐ సెకండియర్ చదువున్నాడు. వీరి ఇంటి పక్కనే ఒబులాపూర్‌కు చెందిన చెల్ల రాజు–రేణుక దంపతులు కొంతకాలంగా నివసిస్తున్నారు. వీరి కూతురు సంధ్య(17) ఇంటర్ సెకండియర్ చదువుతుంది. సంధ్య, శ్రీధర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భావించిన ఇద్దరు రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకొచ్చారు. ఇదిలా ఉండగా సంధ్య కనిపించడం లేదని మంగళవారం తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో యువతి బంధువులు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే బుధవారం సాయంత్రం మామిడిపల్లి–కనగర్తి గ్రామాల మధ్య మూలవాగులో ఇద్దరు మృతిచెంది ఉన్న విషయాన్ని గొర్లకాపరుల ద్వారా గ్రామస్తులకు తెలిసింది. వారి పక్కన గడ్డిమందు డబ్బా పడి ఉండడంతో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్నారు. వీరి ఫోన్, బ్యాగ్ వేములవాడలోని సాయిరక్ష దాబా సమీపంలో లభించాయి. సిరిసిల్లరూరల్ సీఐ సదన్‌కుమార్, కోనరావుపేట, తంగళ్లపల్లి ఎస్సైలు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన బట్టలు, వంట సామగ్రి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన జాగిరి రాజవ్వకు చెందిన ఇల్లు బుధవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బియ్యం, బట్టలు, వంట సామగ్రితోపాటు రూ.10వేల నగదు కాలిబూడిదయ్యాయి. ఇల్లు కాలుతున్న సమయంలో పక్క గదిలో ఉన్న పక్షవాతంతో బాధపడుతున్న శ్రీనివాస్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బాధితురాలు రాజవ్వ భర్త అనారోగ్యంతో గతంలో మృతిచెందాడు. పక్షవాతంతో మంచంపట్టిన కొడుకు శ్రీనివాస్‌తో కలిసి ఆ ఇంట్లో ఉంటుంది. శ్రీనివాస్‌ను ఇంట్లో ఉంచి ఇంటికి తాళం వేసి కిరాణ వస్తువుల కోసం రాజవ్వ బయటకెళ్లిన సమయంలో ఈ సంఘటన జరిగింది. ఇంట్లో నుంచి మంటలు ఎగిసిపడడంతో చుట్టుపక్కల వారు పోగై మంటలను ఆర్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. రాజవ్వ బయట నుంచి వచ్చే సరికి ఇల్లు కాలి బూడిదైంది. భర్త చనిపోయి, కొడుకు పక్షవాతంతో మంచంపట్టడంతో పుట్టెడు దుంఖంతో ఉన్న వారిని విధి పగబట్టింది. నిలువనీడ కోల్పోయిన రాజవ్వ రోడ్డున పడింది. రాజవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన ఎక్కలదేవి మల్లేశం(31) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. హరిదాస్‌నగర్‌కు చెందిన మల్లేశం తన సొంత పని కోసం మంగళవారం సాయంత్రం బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పదిర శివారులోని బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటో బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశం చికిత్స పొందుతూ ఆస్పత్రిలో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన ప్యాసింజర్ ఆటోడ్రైవర్ గొట్టం దేవయ్య అజాగ్రత్తగా, అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారణమయ్యాడు. పనిమీద బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెంది శవమై ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుని తల్లి ఎల్లమ్మ ఫిర్యాదుతో దేవయ్యపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడ్డ మల్లేష్

మెట్‌పల్లిరూరల్: తాటిచెట్టుపై నుంచి జారి పడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి మల్లేష్ అనే గీత కార్మికుడు బుధవారం తాటి చెట్టు ఎక్కి కిందికి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా కిందికి జారి పడ్డాడు. కింది భాగంలో ఉన్న తాటి మొద్దును గుద్దుకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. కాళ్లు, చేతులు, దవడ భాగంలో గాయాలు కాగా.. మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మద్యం పట్టివేత

కథలాపూర్: మండల కేంద్రం నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ వైపు అక్రమంగా మద్యం తరలిస్తుండగా బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కథలాపూర్‌కు చెందిన అజయ్ రూ.8,200 విలువ గల మద్యం తీసుకెళ్తూ కనిపించారు. మద్యం స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.లక్ష నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

రాయికల్: ఒడ్డెలింగాపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఓ వ్యక్తి రూ.లక్ష నగదు ఎలాంటి రశీదు లేకుండా తీసుకెళ్తుండగా జప్తు చేసి జగిత్యాలలోని గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కొద్ది రోజులుగా కొత్త బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం కొత్త బస్టాండ్‌లో మృతిచెంది ఉండటంతో పట్టణ పోలీసులు మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. వయస్సు 50–55 సంవత్సరాలుంటుందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



గంగారెడ్డి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోమటికొండాపూర్‌కు చెందిన రాయేడి గంగారెడ్డి (30) అనే యువకుడు ఉపాధి నిమిత్తం కొంత కాలం క్రితం దుబాయ్ వెళ్లాడు. ఇందుకోసం పలువురి దగ్గర అప్పులు చేశాడు. అక్కడ ఆరోగ్యం సహకరించకపోవడంతో మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి అప్పులు తీర్చే మార్గం లేక మానసికంగా బాధపడేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 18న ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు మొదట మెట్‌పల్లిలోని ఆసుపత్రికి.. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మరణించాడు. తండ్రి పెద్ద రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థిని బలవన్మరణం

కోరుట్లరూరల్: పట్టణంలోని బిలాల్‌పురాకు చెందిన అఫ్రిన్ బేగం(14) అనే విద్యార్థిని బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. షేక్‌హైదర్–సుల్తానా బేగం దంపతుల కూతురు అఫ్రిన్ బేగం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది. 5రోజులుగా పాఠశాలకు వెళ్లటం లేదు. తల్లి పాఠశాలకు వెళ్లమని మందలించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

‘బీఆర్ఎస్‌కు నిరుద్యోగుల ఉసురు తగులుతుంది’



జగిత్యాలలో మాట్లాడుతున్న రియాజ్

జగిత్యాలజోన్: నిరుద్యోగుల ఉసురు బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగులుతుందని తెలంగాణ నిరుద్యోగ చైతన్య యాత్ర రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి నిరుద్యోగ విద్యార్థుల బస్సు యాత్ర నిర్వహించారు. గ్రూపు–1 పరీక్ష లీక్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శమన్నారు. రెండోసారి కూడా గ్రూప్–1 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించలేని ప్రభుత్వానికి నిరుద్యోగులు ఎలా ఓటేస్తారని అన్నారు. వైఫల్యాలతో సతమతమవుతున్న టీఎస్‌పీఎస్‌సీ బోర్డును ప్రక్షాళన చేయాల్సింది పోయి ఇంకా కొనసాగిస్తుండటం ఎంతవరకు సమంజసమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో దాదాపు 3,600 మంది యువత ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండ శంకర్, వివిధ జిల్లాల నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 138





ధర్మపురిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాటు చేసిన రహస్య గదులు, ధర్మపురిలో ఉద్యోగుల వరుస

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వివిధ ప్రదేశాల్లో పోలింగ్ కోసం వెళ్లే ఉద్యోగులు 138 మంది బుధవారం పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ధర్మపురిలోని గిరిజన వసతి గృహంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ఏర్పాటు చేశారు. శిక్షణ తరగతులకు వచ్చిన జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు చెందిన పీవో, ఏపీవోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూపులే..



ధాన్యం నిలువలను పరిశీలిస్తున్న ఎఫ్‌సీఐ అధికారులు

- మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీల చెల్లింపుల్లో జాప్యం
- ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లు
- 2018 నుంచి చెల్లించని ప్రభుత్వం
- జిల్లాలో సుమారు రూ.70కోట్ల బకాయిలు

జగిత్యాలరూరల్: ప్రతీ సంవత్సరం ధాన్యం సేకరణ తర్వాత మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అప్పగిస్తారు. మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్ చార్జెస్ చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం 2018 నుంచి ఇప్పటివరకు చార్జీలు చెల్లించడం లేదు. దీంతో రైస్ మిల్లర్లంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మళ్లీ ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం కావడంతో పాటు మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేశారు. ఐదేళ్లుగా మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో మిల్లర్లంతా ఆందోళన చెందుతున్నారు.

నిర్లక్ష్యం..

జిల్లాలో 2018 నుంచి రా రైస్ మిల్లర్లు 120, పారాబాయిల్డ్ 68 మంది రైస్ మిల్లర్లకు ప్రభుత్వం రూ.70కోట్ల మేర మిల్లింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీలు బకాయి ఉంది. 2సంవత్సరాలుగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో మిల్లర్లంతా ఆర్థిక సంక్షోభంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల నోటిఫికేషన్ ఉండటంతో మిల్లర్లు ఎలాంటి ఆందోళన చేసే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం కేటాయించిన ధాన్యాన్ని కూడా అధికారుల ఒత్తిడి మేరకు తీసుకుంటున్నారు. విద్యుత్ చార్జీలు చెల్లించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బియ్యాన్ని సకాలంలో అప్పగించాలని అధికార యంత్రాంగం ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో మిల్లర్లంతా ఇటు బియ్యం అప్పగించేందుకు, విద్యుత్ చార్జీలు చెల్లించేందుకు, మళ్లీ కొత్త ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రుణాలు చెల్లించేందుకు తిప్పలు

జిల్లాలో ఏర్పాటు చేసిన రా, పారాబాయిల్డ్ రైస్ మిల్లుల యజమానులు బ్యాంక్ రుణాలు తీసుకొని రైస్ మిల్లులను నెలకొల్పారు. కానీ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు ఏళ్ల తరబడి రాక వీరు బ్యాంకర్లకు నెలనెలా చెల్లించాల్సిన రుణాలు జాప్యమవడంతో బ్యాంకర్లు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో చాలామంది రైస్ మిల్లర్లు బ్యాంక్ రుణాలు చెల్లించేందుకు ప్రైవేటు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

బకాయిలు రావాల్సి ఉంది

ప్రభుత్వం రైస్ మిల్లర్లకు మిల్లింగ్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు బకాయిలున్నది వాస్తవమే. ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైస్ మిల్లర్ల ఖాతాల్లో జమ చేస్తాం.

– అభిరాం, డీఎం, సివిల్ సప్లయ్, జగిత్యాల